సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

7

బుధవారం । 22 । మార్చి । 2023



యువత ఆకాంక్షలకు అనుగుణంగా పాలన..

రాష్ట్రంలో యువత ఆకాంక్షలకు అనుగుణంగా సీఎం కేసీఆర్ పాలన సాగిస్తున్నారని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. - 10లో ▸



అవసరమైతే పెద్దాస్పత్రికి రిఫర్ చేయాలి

పీహెచ్‌సీలకు వచ్చే కేసులను అవసరమైతేనే పెద్దాస్పత్రికి రెఫర్ చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. - 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.0° /23.0°

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన సూర్యరశ్మి ఉంటుంది. పొడి వాతావరణం ఉంటుంది. రాత్రిపూట చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

6న నిట్‌కు పవన్ కల్యాణ్

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్ క్యాంపస్‌లో ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించే స్ప్రింగ్‌స్ప్రీ-23 ప్రారంభోత్సవానికిగాను 6వ తేదీన సినీ హీరో, పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ హాజరుకానున్నట్లు ప్రోగ్రాం ఆఫీసర్ నరేంద్రనాయక్ మంగళవారం వెల్లడించారు. స్ప్రింగ్‌స్ప్రీ-23 ఏర్పాట్లను పవన్ కల్యాణ్ వ్యక్తిగత సిబ్బంది ఈనెల 18న పరిశీలించారు.

431మంది విద్యార్థుల గైర్హాజరు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో మంగళవారం నిర్వహించిన ఇంటర్ సెకండియర్ పరీక్షల్లో 431మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్, ఒకేషనల్‌కోర్సులు కలిపి 15,985మందికి 15,554 మంది విద్యార్థులు హాజరుకాగా 431మంది గైర్హాజరయ్యారని డీఐఈఓ ఎ.గోపాల్ తెలిపారు.

వరంగల్ జిల్లాలో..

కాశిబుగ్గ సెంటర్: వరంగల్ జిల్లాలో 27 పరీక్ష కేంద్రాల్లో జరిగిన ఇంటర్ సెకండియర్ పరీక్షకు 6,979 మంది విద్యార్థులకుగాను 6,653 మంది హాజరయ్యారు. 326 మంది గైర్హాజరయ్యారని డీఐఈఓ కాక మాధవరావు తెలిపారు

ఇద్దరు ఎస్‌ఐల బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఇద్దరు ఎస్‌ఐలను బదిలీ చేశారు. వరంగల్ అర్బన్ మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ డి.హరితను వేలేరుకు, ప్రస్తుతం వేలేరు ఎస్‌ఐగా పనిచేస్తున్న నవీన్‌కుమార్‌ను మట్టెవాడ స్టేషన్‌కు బదిలీ చేస్తూ సీపీ రంగనాథ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రాజ్‌భవన్ ఉగాది వేడుకల్లో 'పింగిళి' విద్యార్థులు

హన్మకొండ అర్బన్ : హైదరాబాద్ రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన యువ ఉగాది వేడుకల్లో హనుమకొండ రెడ్‌క్రాస్ సొసైటీ తరపున పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి.చంద్రమౌళి తెలిపారు. సోమవారం రాత్రి జరిగిన వేడుకల్లో విద్యార్థినులు చందా ప్రణీత, దాసు శ్రేయ పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ అజయ్ మిశ్రా, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈవీ శ్రీనివాస్‌రావు, రమేష్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

చిరు ధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవాలి

హన్మకొండ: చిరు ధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవాలని హనుమకొండ జిల్లా శిశు సంక్షేమాధికారిణి సబిత అన్నారు. మంగళవారం హనుమకొండ కేఎల్ఎన్ రెడ్డి కాలనీలో పోషణ పక్షోత్సవం జరిగింది. ఐసీడీఎస్ సీడీపీఓ మధురిమ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు దంపతులకు చిరు ధాన్యాల వంటల పోటీలు నిర్వహించారు. జిల్లా సంక్షేమాధికారి ఎం.సబిత ముఖ్య అతిథిగా పాల్గొని వంటలు పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు వి.రాజ్యలక్ష్మి, డి.రాజ్యలక్ష్మి, టి.కవిత, ఆర్.రమాదేవి, పోషణ అభియాన్ డీసీలు సుమలత, ప్రీతి పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యం ద్వారానే క్షయ నిర్మూలన



వరంగల్: ప్రజల భాగస్వామ్యం ద్వారానే 2025 నాటికి క్షయ వ్యాధిని నిర్మూలించవచ్చని టీబీ ప్రోగ్రాం వరంగల్ జిల్లా అధికారి డాక్టర్ సుధాసింగ్ అన్నారు. ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా మంగళవారం 14వ డివిజన్ పరిధిలోని సుందరయ్యనగర్, కీర్తినగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బ్రేకింగ్ ద బ్యారియర్స్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో క్షయ నివారణ విభాగం ఎస్‌టీఎస్ సుభాషిణి, పీహెచ్ఎం వైకుంఠం, బ్యారియర్స్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రభాకర్, రాధిక, స్కూల్ హెచ్ఎం వెంకటేశ్వర్‌రెడ్డి, అశోక్ కుమార్, ఏఎన్ఎం లావణ్య అంగన్వాడీ టీచర్స్ లత, రత్నశ్రీ, ఆశావర్కర్ విజయ ఆర్పీలు అనిత, శ్రీలత పాల్గొన్నారు.

వరంగల్ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

వరంగల్ రూరల్: వరంగల్ జిల్లాలో అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతుల సమస్యలు, ఇబ్బందులు తెలిపేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పి.ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ సమస్యలను తెలపడానికి నంబర్లు 180042 53424, 91542 52936కు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు. కంట్రోల్ రూమ్‌లో 24 గంటలపాటు సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు.

పాఠశాలల్లో లైబ్రరీలు!

- హనుమకొండ జిల్లాలో 153, వరంగల్ జిల్లాలో 144 పీఎస్, యూపీఎస్‌లలో గ్రంథాలయాలు
- విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచేందుకు దోహదం
- ఒక్కో పాఠశాలకు 252 పుస్తకాలు
- అందుబాటులో కథలు, బొమ్మలు, విజ్ఞానదాయక పుస్తకాలు



వరంగల్ నగరంలోని ప్రభుత్వ ప్రాక్టిసింగ్ పాఠశాల లైబ్రరీలో చదువుతున్న విద్యార్థులు

విద్యారణ్యపురి: వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో లైబ్రరీలు ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో చదివే 1 నుంచి 7వ తరగతి విద్యార్థులకు వారి స్థాయికి తగినట్లుగా కథలు, బొమ్మల పుస్తకాలతోపాటు వివిధ రకాల విజ్ఞానదాయక పుస్తకాలు అందుబాటులో ఉంచనున్నారు. ఇలా ఒక్కో పాఠశాలకు 252 రకాల పుస్తకాలు ఇస్తున్నారు. ఈ మేరకు పాఠశాలలోని ఓ గదిని చదువుకునేందుకు అనువుగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో లైబ్రరీలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఉన్న చోట పుస్తకాలు అరకొరగా ఉన్నాయి. వాటి నిర్వహణ కూడా అంతంతమాత్రమే. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే పాఠశాలల్లో లైబ్రరీల ఏర్పాటుకు ఉపక్రమించింది. హనుమకొండ జిల్లాలో 153, వరంగల్ జిల్లాలో 144 ప్రాథమిక (పీఎస్), ప్రాథమికోన్నత (యూపీఎస్)పాఠశాలలను ఎంపిక చేసి లైబ్రరీలను ఏర్పాటు చేస్తున్నారు. రూమ్ టు రీడ్, నేషనల్ బుక్‌ట్రస్టు సహకారం తీసుకున్నారని సమాచారం. ఇప్పటికే కొన్ని పాఠశాలలకు పుస్తకాలు కూడా వచ్చాయి. ప్రతి పాఠశాలలో లైబ్రరీ గదికి ఒక కార్పెట్, పుస్తకాలను పెట్టుకునేందుకు ఉడెన్ ర్యాక్ కూడా అందజేస్తున్నారు.

పుస్తక పఠనం పెంచేందుకు..

విద్యార్థి దశనుంచే పుస్తకపఠనం పెంచేందుకు ఈ లైబ్రరీలు ఉపయోగపడతాయని, పాఠ్యపుస్తకాలే కాకుండా బాలలకు సంబంధించిన పుస్తకాలు చదవడం వల్ల వారి ఆలోచనా సరళిలో మార్పులు వస్తాయని భావిస్తున్నారు. విరామ సమయంలో ఆ లైబ్రరీ గదిలో తమకు ఆసక్తి ఉన్న ఆయా పుస్తకాలను చదువుకునేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాల్సిఉంటుంది. అందుకే హనుమకొండ జిల్లాలోని 153 పాఠశాలలనుంచి ఒక్కో ఉపాధ్యాయుడికి ఆ లైబ్రరీ నిర్వహణ ఎలా చేయాలి.. విద్యార్థులు ఆయా పుస్తకాలు వినియోగించుకునేలా శ్రద్ధ తీసుకోవాలనే విషయంపై మంగళవారం 53 పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇచ్చారు. మిగతా పాఠశాలల వారికి కూడా శిక్షణ ఇవ్వనున్నారు.

23న తొలివిడతగా కొన్ని పాఠశాలల్లో ప్రారంభం

హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో ఎంపిక చేసిన 297 పాఠశాలల్లో లైబ్రరీల ఏర్పాటు చేయనుండగా, తొలివిడతగా హనుమకొండ జిల్లాలో ఐదు పాఠశాలల్లో, వరంగల్ జిల్లాలో ఒక పాఠశాలలో ఈ నెల 23వ తేదీన ప్రజాప్రతినిధులను ఆహ్వానించి ప్రారంభించనున్నారు. అందులో హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టిసింగ్ ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ మార్కజీ, వడ్డెపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, వంగపహాడ్‌లోని ప్రాథమిక పాఠశాల, గీసుకొండ మండలం గొర్రెకుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉన్నాయి.

అంతర్గత సామర్థ్యాలు పెంపొందేందుకు దోహదం : డీఈఓ

విద్యార్థుల్లో అంతర్గత సామర్థ్యాలు పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలు దోహదం చేస్తాయని హనుమకొండ డీఈఓ అబ్దుల్‌హై అన్నారు. మంగళవారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టిసింగ్ ప్రాథమిక పాఠశాలలో గ్రంథాలయాల నిర్వహణపై ఒక రోజు శిక్షణను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పీఎస్‌లు, యూపీఎస్‌లలో ఏర్పాటు చేస్తున్న గ్రంథాలయాల పుస్తకాలతో పఠనాసక్తిని పెంపొందిస్తాయన్నారు. విద్యార్థి దశనుంచే రచయితలను అర్థం చేసుకోవడం, తమలోని ఆలోచనలను విశ్లేషించుకోవడం, జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవటంలాంటివి కలుగుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, ఎంఈఓ రాంకిషన్‌రాజు, పాఠశాల హెచ్ఎం జి.ఉప్పలయ్య, సీఆర్‌పీ పున్నంచందర్, పి.చంద్రయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలుగింటి తొలి వేడుక ఉగాది

- ఆలయాల్లో పంచాంగ శ్రవణాలకు ప్రత్యేక ఏర్పాట్లు
- సాంస్కృతిక కార్యక్రమాలు, కవి సమ్మేళనాల నిర్వహణ





ఉగాది పండుగ కోసం మామిడి కాయలు, ఆకు, మట్టి కుండలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

హన్మకొండ కల్చరల్ : తెలుగింటి తొలి పండుగ ఉగాదిని బుధవారం జరుపుకునేందుకు జిల్లా ప్రజలు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. శుభకృత్‌నామ సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ శోభకృత్ నామ సంవత్సరానికి ఆహ్వానం పలకనున్నారు. షడ్రుచుల ఉగాది పచ్చడి కోసం అవసరమైన సామగ్రి కొనుగోళ్లతో మంగళవారం నగరంలోని కూడళ్లు కిటకిటలాడాయి. హనుమకొండ చౌరస్తా , కుమార్‌పల్లి, టైలర్‌స్ట్రీట్, అంబేడ్కర్ సెంటర్, ఆదాలత్‌సెంటర్, వరంగల్‌లోని పిన్నవారి వీధి, రామన్నపేట, బట్టలబజార్ తదితర ప్రాంతాల్లో కొత్త కుండలు, మామిడికాయలు, ఆకులు, వేపపూవు, పూల అమ్మకాలు జోరుగా సాగాయి.

ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

శ్రీరుద్రేశ్వరస్వామి వారి దేవాలయంలో ఉగాది సందర్భంగా బుధవారంనుంచి శ్రీరామనవమి నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. శ్రీసీతారాముల విగ్రహప్రతిష్ఠాపన పూజలు చేయనున్నారు. భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేస్తామని ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. సాయంత్రం పంచాంగశ్రవణం, కవి సమ్మేళనం జరుగుతాయని దేవాలయం ఈఓ వెంకటయ్య తెలిపారు.

- శ్రీభద్రకాళి దేవాలయంలో బుధవారం నుంచి వసంత నవనరాత్రి మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. సాయంత్రం 6గంటలకు పంచాంగ శ్రవణం ఉంటుందని ఆలయ ఈఓ శేషభారతి తెలిపారు. మంగళవారం నగర మాజీ సీపీ తరుణ్‌జోషి దేవాలయాన్ని సందర్శించి పూజలు చేశారు.
- హనుమకొండ లష్కర్ బజార్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో ఉగాది పంచాంగ శ్రవణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.
- హనుమకొండ సుబేదారి ఎక్సైజ్‌కాలనీలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఉదయం 10గంటలకు శ్రీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణం, సాయంత్రం 5గంటలకు పంచాంగ పఠనం ఏర్పాటుచేశారు.
- మడికొండలోని శ్రీ మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, సాయంత్రం నూతన సంవత్సరం పంచాంగ పఠనం నిర్వహించనున్నట్లు ఈఓ శేషభారతి తెలిపారు.

రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం కృషి

ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్



చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, కలెక్టర్ సిక్తా పట్నాయక్ సమక్షంలో సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

హన్మకొండ అర్బన్ : ప్రజల సంక్షేమంతోపాటు ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హఠాత్తుగా సంభవించే గుండెపోటునుంచి ప్రాణాలను కాపాడే సీపీఆర్‌పై మంగళవారం జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో అవగాహన కల్పించారు. వినయ్‌భాస్కర్, హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్‌లతో కలిసి జ్యోతిప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ ఇటీవల ఎక్కువగా వస్తున్న సడన్ కార్డియాక్ అరెస్టులను దృష్టిలో ఉంచుకొని సీపీఆర్ లైఫ్ సేవింగ్ టెక్నిక్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ ఐదుగురు వైద్యాధికారులు మాస్టర్ ట్రైనింగ్ పొంది ఉన్నారని, వీరు ఇతరశాఖల సిబ్బందికి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ భగీరథ.. వైద్యాధికారులకు సీపీఆర్‌ను వివరించి, శిక్షణ అందించారు. కార్యక్రమంలో మేయర్ సుధారాణి, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, డీఎంహెచ్ఓ బి.సాంబశివరావు, అడిషనల్ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ మదన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.

రంజాన్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

రంజాన్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని, పండుగ సామరస్యంగా జరిగేలా మత పెద్దలు కృషి చేయాలని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో గురువారంనుంచి రంజాన్ మాసం ప్రారంభం రానున్న సందర్భంగా మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌లతో కలిసి చీఫ్‌విప్ సమావేశం నిర్వహించారు. రాత్రి 11గంటల వరకు పండ్ల దుకాణాలు నిర్వహించుకోవచ్చని అన్నారు.

నష్టపోయిన రైతులందరికీ పరిహారం	విద్యుత్ లైన్లను
దమ్ముంటే నిర్దోషిత్వాన్ని నిరూపించుకో..	పునరుద్ధరించాలి - 10లో ▸

వరంగల్ పశ్చిమనుంచే పోటీ

డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి



63వ డివిజన్‌లో పాదయాత్ర నిర్వహిస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ రాఘవరెడ్డి

కాజీపేట: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆరునూరైనా వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని డీసీసీబీ మాజీ చైర్మన్, జనగామ డీసీసీ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి తెలిపారు. కాజీపేట 63వ డివిజన్ విష్ణుపురి మహంకాళి అమ్మ దేవాలయాన్ని మంగళవారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్పొరేటర్ విజయశ్రీ రజాలీల ఆధ్వర్యంలో ప్రారంభమైన హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర ప్రారంభించారు. భారీగా తరలివచ్చిన కార్యకర్తలతో డివిజన్‌లోని అన్ని కాలనీల్లో పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ కాంగ్రెస్ టికెట్ తనకే వస్తుందని తెలిపారు. అందరూ ఐక్యంగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, నాయకులు తొట్ల రాజు యాదవ్, గుర్రం కోటేశ్వర్, బోయిని కుమార్ యాదవ్, మద్దెల శోభారాణి, సందెల విజయ్ కుమార్, జగదీశ్వర్‌రెడ్డి, బైరి లింగామూర్తి తదితరులు పాల్గొన్నారు.

'జంగా'కు మతిభ్రమించింది

డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి



హన్మకొండ చౌరస్తా: జనగామ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నాడని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి మండిపడ్డారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంనుంచి పోటీ చేస్తానంటూ మంగళవారం కాజీపేటలో రాఘవరెడ్డి చేసిన వ్యాఖ్యలపై నాయిని తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. 'పక్క జిల్లా అధ్యక్షుడిగా ఉంటూ నా జిల్లాలో పాదయాత్ర చేయడానికి రాఘవరెడ్డి ఎవరు? కాంగ్రెస్ శ్రేణులను గ్రూపులుగా తయారుచేసి పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారు. ఇతర జిల్లాలో పార్టీ కార్యక్రమాలు చేపట్టద్దని ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ సంఘం షోకాజ్ నోటీసులు ఇచ్చింది' అని తెలిపారు. అయినప్పటికీ క్రమశిక్షణను ఉల్లంఘించి జనగామ జిల్లాను వదిలేసి హనుమకొండ జిల్లాలో పర్యటించడం సరైంది కాదన్నారు. ప్రతిపక్ష పార్టీకి లాభం చేకూరేలా వ్యవహరిస్తున్న జంగా రాఘవరెడ్డిని పార్టీనుంచి సస్పెండ్ చేయాలంటూ ఆధారాలతో ఏఐసీసీ, టీపీసీసీ నేతలకు, టీపీసీసీ క్రమశిక్షణ సంఘానికి ఫిర్యాదు చేశామని తెలిపారు.

ప్రజల వద్దకు బీఆర్ఎస్ నేతలు!

- ఆత్మీయ సమ్మేళనాలతో ముందుకు
- కార్యకర్తలతో విస్తృత సమావేశాలు
- ఏప్రిల్ 24లోగా పూర్తయ్యేలా కార్యాచరణ..
- ఉమ్మడి వరంగల్ నేతలతో మంత్రి ఎర్రబెల్లి సమీక్ష



వరంగల్, హనుమకొండ జిల్లాల ఇన్‌చార్జ్ ఎంఎస్ ప్రభాకర్‌తో కలిసి సమావేశమైన మంత్రి దయాకర్‌రావు

సాక్షిప్రతినిధి, వరంగల్: బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయడంలో భాగంగా కార్యకర్తలను ప్రజల్లోకి పంపించేందుకు ఆ పార్టీ అధిష్ఠానం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలను ప్రజలకు వివరించే కార్యక్రమంలో కార్యకర్తలందరిని భాగస్వాములను చేయనున్నారు. ఆయాచోట్ల చేపట్టిన పనులు, అమలు చేసిన పథకాల వివరాలను ప్రజలకు వివరించాలని అధిష్ఠానం ఆదేశించింది. ఇందుకోసం కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం పేరిట గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో, వార్డుల్లో సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది.

నేతల భాగస్వామ్యం.. పథకాలపై ప్రచారం...

గ్రామ కమిటీ అధ్యక్షులు, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, రైతుబంధు కన్వీనర్, సింగిల్ విండో చైర్మన్‌లతోపాటు ఆయా జెడ్పీటీసీ, ఎంపీపీ, మండల పార్టీ కార్యవర్గం, అనుబంధ సంఘాలు, కార్పొరేషన్ చైర్మన్లు అందరితో ఈ సమావేశం నిర్వహించనున్నారు. సంబంధిత నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉండే ఎమ్మెల్యేతోపాటు ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్మన్, డీసీసీబీ చైర్మన్, ఇతర పదవులున్న నేతలందరినీ ఆహ్వానిస్తారు. పురపాలక సంఘాల్లో కౌన్సిలర్, పార్టీ వార్డు అధ్యక్షుడు ఇతర కార్యవర్గాన్ని భాగస్వామ్యం చేయనున్నారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు సమావేశాల్లో పాల్గొనేలా కార్యాచరణ రూపొందించారు. పది గ్రామాలను కలిపి ఒక ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేస్తారు. అదే పట్టణాల్లో 3 నుంచి 4 వార్డులను కలిపి ఓ సమ్మేళనం ఉంటుంది. ఆయా గ్రామాలనుంచి వచ్చే కార్యకర్తలకు అక్కడ చేపట్టిన అభివృద్ధిని గణాంకాలతో సహా వివరిస్తారు. పథకాలతో లబ్ధిపొందిన వారి జాబితాను అందిస్తారు.

ఏప్రిల్ 24 వరకు గడువు...

ఏ గ్రామ కార్యకర్తల సమ్మేళనం ఏ తేదీన నిర్వహిస్తారో నియోజకవర్గ ఎమ్మెల్యే నిర్ణయించాల్సి ఉంటుంది. వివరాలను పార్టీ జిల్లా ఇన్‌చార్జ్‌లకు అందజేస్తే అక్కడినుంచి వచ్చిన ఆదేశాలకనుగుణంగా సమావేశాలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 24లోగా ఈ సమ్మేళనాలు పూర్తిచేయాలి. అనంతరం 25న గ్రామాల్లో, వార్డుల్లో పార్టీ జెండాలు ఎగురవేసి పండగ వాతావరణం తలపించేలా కార్యక్రమం చేపట్టాలని సూచనలున్నాయి. కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాల విజయవంతం కోసం పార్టీ జిల్లా ఇన్‌చార్జ్‌లు ఆయా జిల్లాలకు చేరుకొని నేతలకు దిశానిర్దేశం చేయనున్నారు. పార్టీ అనుబంధ విద్యార్థి విభాగానికి చెందిన విద్యార్థులను ఇందులో ఎక్కువ సంఖ్యలో చేర్పించనున్నారు.

సమ్మేళనాలు ఘనంగా నిర్వహించాలి : మంత్రి ఎర్రబెల్లి

ఉమ్మడి జిల్లాలో జరిగే ఆత్మీయ సమ్మేళనాల్లో సీఎం కేసీఆర్ సందేశం ప్రతి కార్యకర్తకు చేరాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఇదే సమయంలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గ్రామాల, మండలాల, నియోజకవర్గ స్థాయిల వారీగా నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళనాలు, వాటి ఏర్పాట్లపై ఉమ్మడి వరంగల్ ముఖ్య నేతలతో ఇన్‌చార్జ్ ఎంఎస్.ప్రభాకర్‌తో కలిసి మంత్రి దయాకర్‌రావు మంగళవారం హన్మకొండ క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. దేశంలో మోదీ ప్రభుత్వ హయాంలో పెరిగిన పెట్రోల్‌తోపాటు నిత్యావసర సరుకుల ధరలు, కేంద్ర ప్రభుత్వ విధానాల వైఫల్యాలు, దేశ ప్రజలతోపాటు, తెలంగాణ రాష్ట్రానికి చేసిన అన్యాయాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, హనుమకొండ జెడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్, మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే అరూరి రమేష్, ఎమ్మెల్యేలు రాజయ్య, ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, వొడితెల సతీష్ కుమార్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు వాసుదేవరెడ్డి, నాగుర్ల వెంకటేశ్వర్లు, మార్నేని రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతి



కాజీపేట: కాజీపేట పట్టణంలో ఇటీవల గుర్తు తెలియని వ్యక్తిని చికిత్స నిమిత్తం ఎంజీఎంలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఎస్సై ప్రమోద్‌కుమార్ కథనం ప్రకారం.. కాజీపేట రైల్వే జంక్షన్ ప్రాంతంలో ఓ వ్యక్తి పడిపోయి ఉన్నట్లుగా అందిన సమాచారం మేరకు రెండు రోజుల క్రితం ఎంజీఎంలో చేర్పించినట్లు తెలిపారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరచడం జరిగిందని, వివరాలు తెలిసిన వారు 87126-85122, 87126-85246, 87126-85008 నంబర్లకు ఫోన్ చేయాలని ఎస్సై ప్రమోద్ కుమార్ తెలిపారు.

కూతురిని కాలేజీకి పంపించేందుకు వెళ్తూ..

- కుమార్తె కళ్లముందే ప్రాణాలు విడిచిన తండ్రి
- కారును ఢీకొట్టిన లారీ
- రైతు మృతి, ఒకరికి గాయాలు


కారులో మృతి చెందిన శ్రీనివాసరావు


క్షతగాత్రురాలు శృతి


శ్రీనివాసరావు (ఫైల్)

ఏటూరునాగారం: కన్నబిడ్డను కాలేజీకి పంపుదామని బయలుదేరిన ఆ తండ్రిని విధి కబలించింది. కళ్లముందే తండ్రి ప్రాణాలు కోల్పోవడంతో కుమార్తె గుండెలవిసేలా రోదించింది. తనను సాగనంపడానికి వచ్చి కానరానిలోకాలకు పోతివా.. అంటూ కన్నీరుమున్నీరుగా విలపించింది. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని రొయ్యూర్ సమీపంలోని 163 జాతీయ రహదారిపై మంగళవారం కంటైనర్ లారీ కారును ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న రైతు మృతి చెందగా, ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. వెంకటాపురం(కె) చెందిన పోలిన శ్రీనివాసరావు (58) తన కుమార్తె పోలిన శృతిని హైదరాబాద్‌లోని కాలేజీకి పంపించేందుకు తన కారులో ఇంటి నుంచి బయలుదేరారు. ఇదే క్రమంలో 163 జాతీయ రహదారిపై ఇసార్ పెట్రోల్ బంక్ సమీపంలో ఎదురుగా ఛత్తీస్‌గఢ్‌కు వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి కారును ఢీకొట్టింది. దీంతో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. కుమార్తె శృతికి తీవ్రగాయాలయ్యాయి. అదే సమయంలో ములుగు వెళ్తున్న వెంకటాపురం జెడ్పీటీసీ పాయం రమణ ప్రమాద స్థలానికి చేరుకుని గాయపడిన శృతిని ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తన వాహనంలో తీసుకువచ్చి చికిత్స అందించారు. సంఘటన స్థలాన్ని ఎస్సై ఇందయ్య పరిశీలించి కారులో ఇరుక్కుపోయి శ్రీనివాసరావు మృతదేహాన్ని బయటకు తీసి ఏటూరునాగారం ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాసరావుకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె హైదరాబాద్‌లో బీటెక్ చదువుతోంది. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులను పలువురు పరామర్శించారు.

ఎన్నిక కమిటీ నియామకం

వరంగల్ లీగల్: వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికల కమిటీ నియామకమయ్యారు. ఎన్నికల నిర్వహణకు ముగ్గురు సభ్యులతో కూడిన సీనియర్ న్యాయవాదులు చిదంబర నాథ్, తాబేటి శ్రీధర్, వి.లలితాకుమారిలను నియమించినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్‌మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా సర్వసభ్య సమావేశం సూచనల మేరకు మంగళవారం అంబేడ్కర్ భవనంలో జరిగిన సమావేశంలో కమిటీ సభ్యుల పేర్లను ప్రకటించినట్లు ఆయన తెలిపారు.

పోలీసుల దాడి

కాజీపేట: కాజీపేట రైల్వే క్వార్టర్స్ సమీపంలో వ్యభిచారం జరుగుతుందనే సమాచారం మేరకు పోలీసులు ఆకస్మికంగా దాడి చేసి ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకోగా విటులు పరారైనట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం మేరకు ఓ ఇంటిలో కొంత మంది యువతులు వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. మహిళలు పట్టుబడగా పరారైన యువకుల్లో ఒకరు ద్విచక్ర వాహనాన్ని వదిలేయగా పోలీసులు స్వాధీనం చేసుకుని విచారణ జరుపుతున్నారు.

అవసరమైతే పెద్దాస్పత్రికి సిఫార్సు చేయాలి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్

హసన్‌పర్తి: ఆస్పత్రిలో వైద్యపరీక్షలు అందుబాటులో లేని పక్షంలో పెద్దాస్పత్రి (హనుమకొండ ప్రసూతి ఆస్పత్రి)కి సిఫార్సు చేయాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. హసన్‌పర్తి పరిధి సిద్దాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక మహిళా క్లినిక్‌ను మంగళవారం కలెక్టర్ తనిఖీ చేశారు. వైద్యపరీక్షల కోసం వచ్చిన మహిళలతో ముచ్చటించారు. ఆస్పత్రిలో అన్ని పరీక్షలు అందుబాటులో ఉన్నాయా, వైద్యులు ఉంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల నమోదు తీరును పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎనిమిది ఆరోగ్య సూత్రాలపై మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి మంగళవారం 50మందికి తగ్గకుండా మహిళలను పరీక్షించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పద్మారాణి, రాష్ట్ర పరిశీలకుడు నంద కిశోర్, ఆప్తాలమిక్ అధికారి రవీందర్‌రెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


డాక్టర్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

ఆస్తి, నీటిపన్నుల వసూళ్ల లక్ష్యాలను సాధించాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో బల్దియా వింగ్ అధికారులు

వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగర పాలక సంస్థ ఆస్తి, నీటిపన్నుల వసూళ్ల లక్ష్యాలను సాధించాలని రాష్ట్ర పురపాలక శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ సత్యనారాయణ ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, బల్దియా ప్రధాన కార్యాలయంలో అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరానికి రూ.88కోట్ల పన్నుల సేకరణ లక్ష్యం కాగా ఇప్పటివరకు 61.50 కోట్లు వసూలు చేసినట్లు తెలిపారు. పది రోజులు మాత్రమే మిగిలి ఉందని, ప్రణాళికాబద్ధంగా పనిచేసి లక్ష్యాన్ని సాధించాలని ఆదేశించారు. ప్రతి శనివారం మున్సిపల్ సర్కిల్ కార్యాలయాల్లో రెవెన్యూ రీడ్రసల్ మేళా నిర్వహించి నగరవాసులనుంచి పేరు మార్పిడి, ఎక్కువ పన్ను విధింపు వంటి విజ్ఞప్తులను సేకరించి, సత్వరమే పరిష్కరించాలని సూచించారు. వీసీలో డిప్యూటీ కమిషనర్లు శ్రీనివాస్ రెడ్డి జోనా, డీసీపీ ప్రకాష్ రెడ్డి, బయాలజిస్ట్ మాధవరెడ్డి, రెవెన్యూ ఆఫీసర్లు శ్రీనివాస్, షాజాది బేగం, యూసుఫోద్దీన్, సుదర్శన్ పాల్గొన్నారు.

మహిళ మృతదేహం లభ్యం

హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్సారెస్పీ కాల్వలో మంగళవారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. ఎగువ ప్రాంతం నుంచి నీటి ప్రవాహానికి మృతదేహం కొట్టుకువచ్చినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. మృతురాలు 50 ఏళ్ల వయసు, 5.2 అడుగుల ఎత్తు కలిగి ఉందన్నారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్సై వివరించారు. పూర్తి వివరాలకు 8712685004 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

'ఏకశిల'లో ఉగాది వేడుకలు


ఉగాది వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం పెంబర్తి శివారులోని ఏకశిల టెక్నో స్కూల్‌లో ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం సాంప్రదాయ వేషధారణలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి విశిష్టతను వివరించారు. అనంతరం ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ హిందువుల తొలి పండుగ ఉగాది అన్నారు. ఈ శోభకృత్ నామ సంవత్సరంలో తెలుగు ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఏకశిల పాఠశాల డైరెక్టర్ గౌరు సువిజారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ జి.ఫణి మోహన్‌రావు, ఏఓ రాంప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భార్యపై కత్తితో దాడి

రామన్నపేట: భార్య అక్రమ సంబంధం పెట్టుకుందనే అనుమానంతో భర్త భార్యను కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడగా సదరు వివాహిత చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఇంతేజార్‌గంజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమ్మరి నాగమణి (30) సుధాకర్ అనే వ్యక్తితో 12 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ప్రస్తుతం వరంగల్ లక్ష్మీపురంలో నివాసముంటున్నారు. గత కొద్ది రోజులుగా భార్యభర్తల మధ్య గొడవ జరుగుతుండటంతో ఎనిమిది నెలల నుంచి వేర్వేరుగా ఉంటున్నారు. ఈ క్రమంలో భార్య అక్రమ సంబంధం పెట్టుకుందనే అనుమానంతో ఈ నెల 18న ఉదయం భార్యను చంపాలనే ఉద్దేశ్యంతో వెంట తెచ్చుకున్న కూరగాయల కత్తితో నాగమణిని పొడిచాడు. ఇది గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బస్సులో గొడవ

కాజీపేట: హైదరాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ప్రయాణికుల మధ్య ఏర్పడిన వివాదం చిలికిచిలికి గాలివానగా మారడంతో పోలీసులు జోక్యం చేసుకుని ఇరు వర్గాల మధ్య రాజీ కుదుర్చారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. హుజూరాబాద్ డిపోకు చెందిన బస్సు హన్మకొండ మీదుగా హైదరాబాద్‌కు వెళ్తుండగా కిటికీ జరుపుకునే విషయంలో ఇద్దరి మధ్య వివాదం తలెత్తింది. దీంతో ఆగ్రహించిన ఓ వ్యక్తి మహిళను దూషించడంతో మనస్తాపానికి గురై డయల్ 100కు ఫోన్ చేసింది. దీంతో కాజీపేట బస్టాండ్‌లో పోలీసులు బస్సును ఆపి గొడవకు గల కారణంపై ఆరా తీశారు. సహచర ప్రయాణికురాలికి సదరు వ్యక్తి పోలీసుల సమక్షంలో తప్పు అయిందని ఒప్పుకోవడంతో గొడవ సద్దుమణిగింది.